## అమ్మవారిని దర్శించుకున్న సియం చంద్రబాబు

### -బాబుకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త:



తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సి.యం. చంద్రబాబునాయుడుకి స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ వస్త్రదారణతో చంద్రబాబు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


## చంద్రబాబుతో కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ ఆత్మీయపలకరింపు

తిరుమల, జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:



ఏడుకొండలవేంకటేశ్వరస్వామి దర్శనార్థం గురువారం ఉదయం తిరుమల ఆలయంలోనికి చేరుకున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్ దంపతులు రంగనాయకుల మండపంలో సిఎం చంద్రబాబునాయుడు, కుటుంబ సభ్యులతో కలసి వేదాశీర్వచనం తీసుకున్నారు. ఇద్దరూ ఆలయంలోపల కొంతసమయం గడిపి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంత్రి లోకేష్‌ను గోయల్ ఆత్మీయంగా పలకరించారు.

# భక్తిప్రపత్తులతో శ్రీవారి సేవలో...

### ఇష్టదైవమ్ సన్నిధిలో సిఎం చంద్రబాబు -అఖిలాండం వద్ద కొబ్బరికాయ మొక్కులు







తిరుమల, జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్రముఖ్యమంత్రిగా నాల్గవసారి ప్రమాణస్వీకారం చేసిన నారాచంద్రబాబునాయుడు సిఎం హోదాలో ఆద్యంతం భక్తిప్రపత్తులతో గురువారం ఉదయం ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నుదుటన నామం ధరించి, సాంప్రదాయదుస్తుల్లో ఆలయంలో భక్తితో గడిపారు. నోట గోవిందనామం స్మరిస్తూ బాబు శ్రీవారి చెంత గడిపారు. కుటుంబసభ్యులు సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు నారాలోకేష్, కోడలు నారా బ్రాహ్మిణి, మనవడు దేవాన్ష్‌తో కలసి గురువారం ఉదయం వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టిటిడి ఇన్‌ఛార్జి ఈఓ వీరబ్రహ్మం, జెఈఓ గౌతమి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. కులదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఇన్‌ఛార్జిఈఓ వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. వేంకటేశ్వర స్వామి, పద్మావతిఅమ్మవారి చిత్రపటాలను బహుకరించారు. ఆలయానికి ఎదురుగ ఉన్న అఖిలాండం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి, కుటుంబంతో కలసి కొబ్బరికాయలు కొట్టి ,కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రమంత్రి నారాలోకేశ్ కుటుంబం, రాష్ట్రదేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కరికాలవలవన్, డిఐజి షిమోషి, తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీన్‌కుమార్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి ఇన్‌ఛార్జి ఇఓ వీరబ్రహ్మం, జెఇఓ గౌతమి, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, ఎంపి ప్రసాదరావు, తిరుపతి,చిత్తూరుజిల్లాల ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు ఉన్నారు.

# తిరుమల పవిత్రతను కాపాడుతా

### -మీడియాతో సిఎం చంద్రబాబునాయుడు

తిరుమల, జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్రంలో గత ఐదేళ్ళ అరాచక పాలననుండి ప్రజాపాలన దిశగా అడుగులు వేస్తున్నామని, పేదరికం లేని సమాజం కోసం నిత్యం పనిచేస్తానని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలిపారు. కులదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల పవిత్రతను కాపాడుతానని, ఇక్కడ గోవింద నామం తప్ప మరొకటి వినిపించకూడదన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నానన్నారు. ముఖ్యమంత్రిగా నాల్గవసారి ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా కుటుంబంతో కలసి చంద్రబాబు, మంత్రులు నారాలోకేశ్, నారాయణ గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ దంపతులు ఆలయంలోనికి చేరుకుని చంద్రబాబుతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. నాల్గవసారి సిఎం హోదాలో తొలిసారిగా గురువారం ఉదయం గాయత్రినిలయం అతిథిగృహంలో మీడియాప్రతినిధులతో బాబు మాట్లాడారు. తాను ఏ సంకల్పంచేసినా ఒక్కనిమిషం వేంకటేశ్వరస్వామిని తలచుకుని ఆ సంకల్పం ప్రకారం చేయడం జరుగుతుందన్నారు. తాను చిన్నపుడు చదువుకున్న రోజుల్లో కాలినడకన శ్రీవారిమెట్టుమార్గంలో తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నానని గుర్తుచేసుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ,దేశ రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించే పరిస్థితి వచ్చిందన్నారు. 2003లో అలిపిరిలో బాంబుదాడిలో తనకు స్వామివారు ప్రాణబిక్షపెట్టి, ఈ రాష్ట్రానికి, జాతికి సేవలందించాలని ఆదేశించారన్నారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తలపెట్టిన ఉచిత భోజనం పథకం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. తరువాత దేవాన్ష్ పుట్టినప్పటి నుండి ఒకరోజు అన్నదానం కార్యక్రమానికి విరాళం ఇస్తున్నాన్నారు. తాను ఎప్పుడూ వేంకటేశ్వరస్వామిని ఒక్కటే కోరుకుంటానని, తాను పవిత్రమైన మనసుతో నిద్రలేచి బయటకు వచ్చేముందు నిమిషంపాటు స్వామివారిని ధ్యానం చేస్తాన్నారు. ఈ ప్రార్థనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటానన్నారు. మన కుటుంబవ్యవస్థ ప్రపంచానికి ఆదర్శబన్నారు. నేను అందరివాడినని, ఏ ఒక్కరి వ్యక్తిని కాదని స్వామివారి సాక్షిగా చెబుతున్నానన్నారు. తప్పు చేసినవారికి శిక్ష తప్పదన్నారు.

# అంతరాష్ట్ర దోపిడి దొంగలు ఇద్దరు అరెస్టు

### రూ. 25 లక్షలు విలువైన సుమారు 400 గ్రాముల బంగారు నగలు , 2.25 కేజీల వెండి ఆభరణాలు, టీవీ స్వాధీనం : క్రైం డీఎస్పీ

తిరుపతి క్రైం, జూన్ 13, ప్రభాతవార్త

కరుడుగట్టిన ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడి దొంగలు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 25 లక్షలు రూపాయిలు విలువైన సుమారు 400 గ్రాముల బంగారు నగలు, 2.25 కేజీల వెండి ఆభరణాలు, సోనీ కంపెనీ 41 ఇంచిల టీవీ స్వాధీనం చేసుకున్నామని క్రైమ్ డిఎస్పి రవి కుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ తిరుపతి పట్టణం, తిరుపతి రూరల్, చంద్రగిరి, అలిపిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోలలో చేసిన 11 ఇంటి దొంగతనాల (హౌస్ బ్రేకింగ్స్) కేసులలో ముద్దాయిలగా నిర్ధారణ జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు క్రైమ్ డిఎస్పి రవికుమార్ కేసు వివరాలు వెల్లడించారు. గురువారం తిరుపతి క్రైం పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి క్రైమ్ డిఎస్పి రవికుమార్ ఈ కేసు వివరాలను వెల్లించారు. ఈ సందర్భంగా క్రైమ్ డిఎస్పి మాట్లాడుతూ అరెస్టు అయిన ముద్దాయిల వివరాలు ఇలా వున్నాయన్నారు. తమిళనాడులోని ఊటీ, నీలగిరి జిల్లా మిడిలీ గూడళ్లురు గ్రామంకు చెందిన మగేష్ మణికంట అనే మణి అనే మణిరత్న (43) ఏలూరు వెస్ట్ గోదావరి జిల్లా, బూడిద అప్పన్నగారి వీధి, తంగేలాముడి గ్రామంకు చెందిన గౌస్ మోహిద్దీన్ కుమారుడు షేక్ అలీ మోహిద్దీన్ (38)లు ఈ నెల 12వ తేది సాయంత్రం 5.30 గంటలకు అలిపిరి చెర్లోపల్లి రోడ్డులో వేదిక్ యూనివర్శిటీ సమీపంలో సదరు ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. తిరుపతి చుట్టు పక్కల జరుగుతున్న ఇంటి దొంగతనములపై నిఘా ఉంచి, దొంగలను పట్టుకోవాల్సిందిగా తిరుపతి జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల పై తిరుపతి జిల్లా క్రైమ్‌అడిషనల్ ఎస్పి విమలకుమారి పర్యవేక్షణలో, తిరుపతి క్రైం డిఎస్‌పి రవికుమార్ ఆధ్వర్యంలో తిరుపతి సీసీఎస్ ఇన్స్పెక్టర్ కళా వెంకటరమణ, రామకృష్ణ, క్రైమ్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు రవి ప్రకాష్, గోపి కృష్ణ, బసవరాజు రమేష్, శ్రీనివాసులు, వినాయకం, కానిస్టేబుళ్లు నాగరాజా శెట్టి, మోహన్, ప్రసాద్‌లతో వేర్వేరు బృందాలుగా ఏర్పడి, గాలించి, ఆ దొంగల గురించి తెలిసిన సమాచారం మేరకు ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి నుండి దొంగిలించబడిన సొత్తును స్వాధీనం చేసుకోవడమైందన్నారు. ఈ ముద్దాయిలలోని మిద్దాయి మగేష్ మణికంఠ అనే మణి అనే మణిరత్న తిరుపతి, నారాయణవనం, వెంకటగిరి, రేణిగుంటలలో దొంగతనములు చేసి సుమారు 50 కేసులలో ముద్దాయిగా ఉన్నాడని తెలిసిందన్నారు. అలాగే మరో ముద్దాయి షేక్ అలీ మోహిద్దీన్ సుమారు 40 కేసులలో ముద్దాయిగా ఉన్నాడు. ఇతనిపై నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో డీసి షీట్ వుందని తెలిపారు. ఈ దొంగతనము కేసులలో విశేష ప్రతిభ చూపిన వారిని అభినందిస్తూ తిరుపతి జిల్లా ఎస్పికి, సిబ్బందికి రివార్డుల నిమిత్తం ప్రతిపాదనలను పంపనున్నట్లు తిరుపతి క్రైమ్ అడిషనల్ ఎసిపి విమలాకుమారి తెలిపారని క్రైం డిఎస్పి రవి కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి క్రైం డిఎస్పి రవికుమార్, సిఐలు కళ వెంకటరమణ, రామకృష్ణ, ఎస్ఐలు, క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువుల్లో అడ్డగోలుగా తవ్వకాలు

### ఓజిలి దామరగుంట చెరువులో రాత్రింబవళ్లు సాగిస్తున్న రవాణా

### మామూళ్ల మత్తులో అధికారులు -లబోదిబోమంటున్న రైతులు, మత్స్యకారులు

ఓజిలి, జూన్ 13, ప్రభాతవార్త

వైకాపా నేతల ధన దాహానికి, అధికారుల నిర్లక్ష్యానికి చెరువులు ఆగమవుతున్నాయి. ఓజిలి గ్రామంలో ఉన్న దామరగుంట చెరువు నుండీ భారీ ఎత్తున కోట్ల రూపాయిలు విలువచేసే మట్టి అక్రమంగా అనుమతులకు మించి తరలించేశారు. కోట్ల రూపాయిలు విలువచేసే మట్టిని టిప్పర్‌లతో మట్టిని తరలిస్తున్నారు. జేసిబిలతో చెరువులో పెద్ద పెద్ద గోతులు తవ్వుతున్నారు. ఇంత భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులలో చలనం లేదని, ఇది రాజకీయనాయకులు, ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఒక వైపు టిప్పర్ల సౌండ్, మనుషులు కూడా కనపడని దుమ్ము, ధూళితో నిండిన రహదారుల పై ముందు ఏ వాహనం వస్తుందో కూడా తెలియని పరిస్థితిలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అనుమతులు లేకుండా ఇంత భారీ ఎత్తున అక్రమంగా మట్టిని తరలిస్తుంటే రెవెన్యూ అధికారులు కానీ, ఇరిగేషన్ అధికారులు కానీ, మైనింగ్ అధికారులు కానీ పట్టించుకునే పాపానలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యజమానులు కేవలం ధనదాహంతో విచ్చల విడిగా మైనింగ్‌కు పాల్పడుతున్నారని అంటున్నారు. చెరువులలో సైతం పెద్ద పెద్ద గోతులు పెట్టి మట్టి తవ్వుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అండతోనే దందా మట్టి రవాణా గుర్చి పలుసార్లు పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓజిలి మండలం అధికారులే అక్రమార్కులకు వెన్నుదన్నులా ఉన్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ప్రకృతి సంపద కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు కలెక్టర్, స్పందించి అవినీతి అడ్డుకట్ట వేయాలని చెరువులను కాపాడాలని అనుమతులకు మించి అక్రమంగా తరలించిన వారిపై సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే కోర్టులను ఆశ్రయిస్తామని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ప్రకృతి సంపద కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అనుమతులకు మించి చెరువుల్లో అడ్డగోలుగా మట్టిని తరలిస్తున్న వైనం (పాత చిత్రం)

## ఎస్వీయూలో మెగా డీఎస్సీపై నిరుద్యోగుల సంబరాలు



8లో

## గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు ....

### పట్టించుకోని ఎస్ఈబి-పోలీసులు ....

దొరవారిసత్రం జూన్ 13 ప్రభాతవార్త ; మండలంలోని ఏకొల్లు,వేణుంబాకం,వెదురుపట్టు,బూదూరు,ఉచ్చూరు,మీజూరు,తదితర గ్రామాల్లో కొంతమంది అక్రమార్కులు బెల్టుషాపులను విచ్చలవిడిగా నిర్వహిస్తున్న సంబందిత ఎస్ఈబి-పోలీసులు మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామీణ మహిళలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం వల్లన యువత ఎక్కువగా మద్యానికి బానిసలతున్నారని ప్రజలు వాపోతున్నారు.బెల్టుషాపులను గ్రామాల్లో నిర్మూలించాలని మహిళలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపినా అధికారులు పట్టించుకొన్న దాఖలాలేన్నారు.బెల్టుషాపుల్లో ఎమ్ఆర్పి ధరలకన్న ఒక బాటిళ్ళుపై 50 రూపాయల వరకు అధనంగా మందుబాబుల నుండి వసూళ్ళు చేస్తున్నట్లు మందుబాబులు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం వల్లన ఎన్నో కుటుంబాలు మద్యానికి బానిసై వీధినపడినట్లు బాధిత మహిళలు తమగోడు వెల్లబుచ్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది

# రూ.కోట్లు వెచ్చించినా క్రీడాకారులకు అందుబాటులో లేని ట్రాక్‌లు

**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం. ఈ దివ్యక్షేత్రంలో శ్రీ విద్యాప్రకాశానంద డిగ్రీ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం దేవస్థానంకు సంబంధించిన కైలాసగిరి పర్వత పంక్తుల్లోని 12 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ సకల సదుపాయాలతో కళాశాల,అనుబంధ కళాశాలలు,చక్కటి స్టేడియం నిర్మించుకొనుటకు శ్రీకాళహస్తిలోని క్రీడాకారులను ప్రోత్సహించుటకు చక్కటి క్రీడా మైదానాన్ని 1976లో అందించారు. ఇక్కడ దశల వారిగా కళాశాలకు భవనాలతో పాటు చక్కటి క్రీడా మైదానం ఉండేది. అయితే ఇక్కడ స్టేడియం నిర్మాణానికి 2014-2019 అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. బాధ్యతను స్పోర్ట్స్ అథారిటీకికి అప్పగించింది. కళాశాల స్థలంలో 5 ఎకరాలు అథారిటీకి అప్పగించింది. అప్పటిలో పనులు అంతా అస్తవ్యస్తంగా నిర్వహించారు. వదలి ఎపెట్టారు.తరువాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా పర్యవేక్షణ లోపంతో కళాశాల మైదానం ఎదురుగా ఇష్టమొచ్చినట్లు దుకాణాలు వెలుస్తున్నాయి. మరి స్పోర్ట్స్ అథారిటీ నిద్రోతుంది.)శ్రీకాళహస్తికి మంచి స్టేడియం రూపకల్పన జరుగుతుందా?**



డిగ్రీ కళాశాల క్రీడామైదానం

శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో క్రీడాకారుల కోసం 1976కు పూర్వం చక్కటి గ్రౌండ్‌ను ఏర్పాటు చేసారు.అయితే దానిని బాగు చేయటానికి కళాశాల తిప్పలు పడుతుండగా గతంలో ఈ నియోజక వర్గాన్ని పరిపాలించిన తెలుగుదేశం నాయకులు తమ అస్మదీయుల కోసం రూ.2కోట్లు నిధులు కేటాయించారు. కళాశాలకు సంబంధించిన 12 ఎకరాల స్థలంలో 5 ఎకరాల స్థలాన్ని స్పోర్ట్స్ అధారిటీకి అప్పగించారు.పనులను అప్పటి పాలకులు తమకు అత్యంత సన్నిహితంగా ఉన్న అస్మదీయులకు అప్పగించారు. అయితే సుమారు 8 సంవత్సరాల క్రితం నిధులు మంజూరు చేసిన

### చీకటి పనులకు నిలయంగా మారిన భవనాలు

### దుకాణాలుగా మారుతున్న స్థలాలు

ప్రభుత్వం, పనులు పర్యవేక్షించిన స్పోర్ట్స్ అధారిటి జవాబుదారి తనం కొరవడటంతో నిధులు కేవలం రెండు భవనాలకే పరిమితం అయ్యాయి. మొదట మంచినీళ్ళ గుంటను తరువాత దాని పక్కనే ఉన్న కళాశాల గోడ పక్కన ఏర్పాటు చేయాలని పరిశీలించారు. చివరకు కళాశాలకు సంబంధించిన 12 ఎకరాల్లో 5 ఎకరాల స్థలాన్ని 'స్పోర్ట్స్ అధారిటీకి'కి అప్పగించారు.పనులను తెలుగుదేశం ప్రభుత్వం అస్మదీయులకు అప్పగించారు. అనుభవం లేని అస్మదీయులు తమ ఇష్టం వచ్చినట్లు భవన నిర్మాణాలు చేసారు.ఇక ఇక్కడ ఓపెన్ ట్రాక్ 400 మీటర్లు,800 మీటర్ల ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇక్కడ ఓ జిమ్ భవనం నిర్మించి చేతులు దులుపు కున్నారు. ఇండోర్ స్టేడియం లేదు. ఇక స్పోర్ట్స్ అధారిటి చైర్మెన్ ఇక్కడ పనులు జరిగినపుడు పరిశీలించి పలు విమర్శలు ఆరోపణలు చేసారు. దీనికి తోడు విద్యుత్ శాఖ వారు గ్రౌండ్ మధ్యలో హెచ్‌టి విద్యుత్ లైన్లు తీసుకెళ్ళారని వాటిని పక్కకు తొలగించుకోవాలని సూచించారు. కానీ ఏదీ అమలు జరగలేదు.తరువాత ఐదేళ్లు పరిపాలించిన ప్రభుత్వం మండలానికి ఒక మిని స్టేడియం అంటూ ప్రకటించింది. కానీ ఆచరించలేదు.

**భవనాలతో చేతులు దులుపుకున్నారు:**

ఇక్కడి మైదానంలో 5 ఎకరాల స్థలాన్ని తీసుకున్న స్పోర్ట్స్ అధారిటి కేవలం రెండు భవనాలు నిర్మించి చేతులు దులుపుకున్నారు.ఈ భవనాలు చీకటి పనులకు నిలయంగా మారింది. ఇక్కడ పర్యవేక్షణ భద్రత లేకపోవటంతో అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా తయారైంది. ఇక కానీ పట్టించుకునే దిక్కులేదు. ఇక్కడ కొందరు ప్రైవేటు వ్యక్తులకు ఐదేళ్ళు పరిపాలించిన పాలకులు ధారాదత్తం చేసారు.ఇక్కడ నిర్మాణాలకు సంబంధించి అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహారించినప్పటికి దీనికి ఉన్న కమిటి నామమాత్రంగా మారింది. ఇక్కడ స్థలం తీసుకున్న అధారిటి పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. కోట్ల రూపాయల విలువ కల్గిన 5 ఎకరాల స్థలాన్ని తీసుకున్న ఆధారిటి పరిరక్షణను కూడా గాలికి వదలిపెట్టడంతో చుట్టూ డాబాల్లా దుకాణాలు వెలుస్తున్నాయి. అయితే స్పోర్ట్స్ అధారిటి ఓ కమిటిని నియమించుకుంది. ఈ కమిటి నామమాత్రంగామారింది.ప్రస్తుతం మళ్ళీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. మరి ఆ పాలకులు అయినా పట్టించుకుంటారా? లేదా? అని క్రీడాకారులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత శాసనసభ్యుడు గతంలో జిల్లా కమిటి పగ్గాలు కూడా నిర్వహించారు.

## చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సంబరాలు

వెదురుకుప్పం, జూన్ 13 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని భారతం మిట్ట కూడలిలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాల్గవ పర్యాయం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడం పురస్కరించుకుని కేక్ కత్తరించి బాణా సంచాపేల్చి సంబరాలు జరుపుకు న్నారు. ఈ కార్యక్రమంకు మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి మెహన్ మురళి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కత్తరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా డాక్టర్ వియం.థామస్ గెలుపొందం తొలిసారిగా జీడీ.నెల్లూరు నియోజకవర్గం ఏర్పడ్డాక తెలుగుదేశం పార్టీ జెండా పాతడం సంతోషంగా ఉందన్నారు. బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు రాష్ట్రంను అభివృద్ధివైపు పరుగులు పెట్టిస్తారని, విజన్ కలిగిన నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలార్ చిన్నబ్బ, కోదండ రెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దాసు, సుబ్బరాయులు, ఉదయచంద్, ఓం కిరణ్, సుజాత, చిట్టెమ్మ కోటేశ్వరి, కుమారి, రోజా, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ స్కూల్ వ్యవహారంపై చర్యలు చేపట్టాలి

రామకుప్పం, జూన్ 13 ప్రభాతవార్త



స్థానికంగా నిర్వహిస్తున్న శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వ్యవహారంపై తగు చర్యలు తీసుకోవాలని కేశవరెడ్డి, నవీన్ తదితరులు ఎంఇఒ నారాయణకు ఫిర్యాదు చేశారు. స్కూల్‌లో కేవలం ఐదో తరగతి వరకే క్లాసుల నిర్వహణకు అనుమతులు ఉండగా పదవ తరగతి వరకు చట్ట విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అనుభవం లేని ఉపాధ్యాయులను నియమించుకున్నారన్నారు. పాఠశాలలో ఇరుకైన తరగతి గదులు ఉన్నాయని భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు స్పందించి తగు విచారణ జరపాలని పేర్కొన్నారు.

## బిజెపి చీఫ్ పురంధేశ్వరిని కలసిన కుప్పం కన్వీనర్

కుప్పంరూరల్, జూన్ 13 ప్రభాతవార్త



రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరిని కుప్పం బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడ పార్టీ కార్యాలయంలో ఆమెను కలసి ఘనంగా సత్కరించారు. రాజమండ్రి ఎంపిగా గెలవడంతో పాటు బిజెపి గెలుపుకు పుర ంధేశ్వరి కృషి చేశారని ఆయన కొనియాడారు. కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సులభతర బోధనతోనే ఉత్తీర్ణత సాధ్యం

గంగాధర నెల్లూరు, జూన్ 13 ప్రభాతవార్త:



సులభతర బోధనతోనే ఉత్తీర్ణత సాధ్యమని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు అన్నారు.గురువారం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని నెల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులతో ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం పలు రికార్డులతో పాటు మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యత పరిమాణం లాంటివి తనిఖీ చేశారు.అలాగే ఉపాధ్యాయులతో విద్యాబోధన గురించి పలు సమస్యలపై చర్చించారు. ఈ పాఠశాల గత సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో మొదటి ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకోవడం హర్షనీయమని సంతోషం వ్యక్తం చేశారు.రానున్న విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.మండల విద్యాశాఖ అధికారులు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సుబ్బరత్నమ్మ ఇంచార్జ్ హెచ్ఎం యుగంధర్ ఆచ్చారిలు పాల్గొన్నారు.

## సిఎంతో కలసి శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, జూన్ 13 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబీకులతో కలసి ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సందర్భంగా ముఖ్యమంత్రి కుటుంబంతో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీ వెంక టేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే డా॥ మురళీమోహన్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అండర్ 19 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జ్యోత్స్న

పాకాల, జూన్ 13, ప్రభాతవార్త



తిరుపతిలో జరిగిన జిల్లా స్థాయి బ్యాట్మెంటన్ పోటీలలో అండర్ 19 డబుల్ విభాగంలో, ఉమెన్స్ సిగ్నల్స్ విభాగంలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి సెప్టెంబర్ నెలలో జరగబోయేటువంటి వంటి పోటీలకు ఎంపికైన జ్యోత్స్నను కోచ్ బాటగంగాధర్ అభినందించారు. పాకాల మండలం తలారిపల్లెకు చెందిన జ్యోత్స్న తల్లి పార్వతి, తండ్రి వెంకటాద్రి సంతోషాన్ని వ్యక్తపరిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకొని తను పుట్టిన ఊరికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ధ్యేయమని జ్యోత్స్న తెలిపారు.

## ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేత

పాకాల, జూన్ 13, ప్రభాతవార్త



2024 – 25 విద్యా సంవత్సరానికి చెందిన స్టూడెంట్స్ కిట్స్ ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాలకు అందజేసామని పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. గురువారం పాఠశాలలు పున:ప్రారంభం అయిన సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందించడం జరుగుతున్నదని అన్నారు. వీటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందించాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే క్రమంలో పేరెంట్స్ దగ్గర సంతకాలు పెట్టుకొని ఇవ్వాలని పేర్కొన్నారు. ఎంఈఓ 2 లింగయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రతి తరగతి టెక్స్ట్ బుక్స్‌లు కొత్తదనం ఉందని, సెమిస్టర్ విధానంలో ఉందని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో విశేష పూజలు

చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త



స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే ప్రధానార్చకుడు పృధ్వీనవీన్ ఆధ్వర్యంలో ఉభయదారులచే స్వామివారిని అభిషేకించి, ప్రత్యేకాలంకరణగావించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలనందించారు.

## సిఎంతో కలసి శ్రీవారిని దర్శించుకొన్న దగ్గుమళ్ల

చిత్తూరురూరల్, జూన్ 13 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడుతో కలసి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల వరప్రసా ద్‌రావు శ్రీవెంకటేశ్వ రస్వామిని గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో దర్శించుకొన్నారు. అంతకు ముందు సిఎంతో కలసి తిరుమలకు చేరుకొన్న వరప్రసాద్ రావుకు టిటిడి అధికారులు సాదరస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసారు. అనంతరం తిరుమల ఆలయంలోని రంగనాయకులమండపంలో ముఖ్యమంత్రితో కలసి వేద ఆశీర్వచనం అందుకొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మంత్రి ఆనంకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే పాశం

కోట, జూన్ 13 ప్రభాతవార్త



మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి నియమితులు కావడంతో గురువారం అమరావతిలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు ఆయన సతీమణి సంధ్యారాణి కూడా ఉన్నారు.

## మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

కోట, జూన్ 13 ప్రభాతవార్త



కోట మండలంలోని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో గురువారం డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. పాఠశాల గోడలు, హాస్టళ్ల గోడలపై డీజిల్, ఆయిల్‌తో స్ప్రే చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉంటే వెంటనే తీసేయాలని సూచించారు. గుంతల్లో నీరు చేరిన దోమలు ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అన్నిటినీ ప్రభుత్వమే చేస్తుందని చూస్తూ ఉంటే రోగాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు.

## వయోవృద్ధులకు బిసిజి టీకాలు తప్పనిసరి

కోట, జూన్ 13 ప్రభాతవార్త

వయోజనులంతా బిసిజి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వారు, మధుమేహం ఉండి, ధూమపానం అలవాటు ఉన్న వారు, గడచిన ఐదేళ్లలో క్షయవ్యాధి సోకి తగ్గిన వారు, గత మూడేళ్లుగా టీబీతో బాధపడుతున్న వారు ఈ టీకాలు వేయించుకోవాలని కోరారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో త్వరలో వ్యాక్సిన్ వేస్తారని ఆయన చెప్పారు.

## మంత్రివర్గ కూర్పు భేష్

కోట, జూన్ 13 ప్రభాతవార్త

రాష్ట్ర మంత్రి వర్గం కూర్పు బాగుందని, సామాజిక సమతూకం పాటిస్తూ యువతరానికి పెద్దపీట వేశారని తిరుపతి జిల్లా టీడీపీ బిసిసెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు చెప్పారు. గురువారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించడం సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చేలా మంత్రుల ఎంపికలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని కితాబిచ్చారు. రాష్ట్ర పున:నిర్మాణ సవాలును దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసుకున్న ఈ జట్టు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుపుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## తడ మండల పాఠశాలలకు విద్యాసామగ్రి పంపిణీ

తడ, జూన్ 13 ప్రభాతవార్త



తడ మండలంలోని వివిధ పాఠశాలలకు గురువారం నుంచి విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్నారు. ఎంఇఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మండల స్టాక్ పాయింట్ నుంచి ఈ సామగ్రి పంపిణీ జరుగుతోంది. మొదటిరోజు అక్కంపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్, చినమాంబట్టులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేశారు. శుక్రవారం నుంచి మిగిలిన పాఠశాలలకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తామని ఎంఇఓ తెలిపారు.

# పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా

### వైసిపి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జూన్ 13, ప్రభాతవార్త



పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు రాంకుమార్ రెడ్డిని వచ్చి కలిశారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమేనని ఎవరు అధైర్య పడవద్దని మనోధైర్యం ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎలాంటి సమస్య ఉన్నా తనను వచ్చి కలవచ్చని వారికి తెలిపారు. వెంకటగిరి యువరాజు కుమార్ యాచేంద్ర, కలవాయి జడ్పిటిసి సభ్యులు అనిల్ కుమార్ రెడ్డి మాజీ ఏఎంసి ఛైర్మన్ వి. మధుసూధన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నాగయ్య, కార్తీక్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, తదితర నాయకులు వచ్చి కలిశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త



పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా వైద్యులు సూచించిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని ట్రస్ట్ ప్రతినిధి సీతారామ నాయుడు తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ సహకారంతో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయించాల్సిన వారిని గుర్తించారు. అదే విధంగా రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి సీతా రామనాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో వైద్యులు సూచించిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఈ ఏపిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ ఏపిసెట్ ఫలితాలలో గూడూరు పట్టణంలోని శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు ఈ ఎపిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం అభినందనీయం అన్నారు. అనంతరం స్టడీ సర్కిల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్వేష్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో 7247వ ర్యాంక్, ఎస్‌వి యూనివర్సిటీ పరిధిలో 1194వ ర్యాంకు, సుష్మ రాష్ట్ర స్థాయిలో 8835వ ర్యాంక్, ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో 1551వ ర్యాంక్, విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయిలో 10వేల లోపు 3 ర్యాంక్‌లు 20 వేల లోపు 6 ర్యాంక్‌లు, 25 వేల లోపు 75 ర్యాంక్‌లు మొత్తం 152 మందిర్యాంక్‌లుసాధించారన్నారు.చంద్రశేఖర్, కమలాకర్, మునిరాజా, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, పవన్ సారధ్యంతో ప్రజల కలలు సాకారం

మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్

ఓజిలి, జూన్ 13, ప్రభాతవార్త

నేతలు ఎంత మంది ఉన్నా జాతి గర్వపడే నాయకులు కొందరే ఉంటారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. ఆ కొందరిలో నూతన ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఉంటారని చెప్పారు. చంద్రబాబు నాయుడు అంటే కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని ఆయన ఒక అనితరసాధ్యుడని, అద్వితీయ దార్శనికుడని, తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడని, రేపటి తరాల భవితను తీర్చిదిద్దే మహాశిల్పి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఎన్డీఏ కూటమితోనే సాధ్యమవుతుందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీని ప్రజల ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో ప్రజలకు ఓజిలి మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన సన్నారెడ్డి

చిట్టమూరు, జూన్ 13 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం చిట్టమూరు మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోవు కాలం మనదేనని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందని తెలియజేశారన్నారు. పార్టీ పటిష్టత కోసం మరింత కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గూడూరు నియోజకవర్గ ప్రజలకు మేరిగ మురళీధర్ ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని సన్నారెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.

## లోకేష్‌బాబును కలిసిన ఎన్ఆర్ఐ వెంకటతేజ

నాయుడుపేట (పెళ్లకూరు), జూన్ 13 ప్రభాతవార్త



పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పేరం మధునాయుడు కుమారుడు, ఎన్ఆర్ఐ పేరం వెంకటతేజ గురువారం తిరుమలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమలలో చంద్రబాబు, లోకేష్‌బాబులను కలిసిన ఆయన విజయోత్సవ శుభకాంక్షలు తెలియజేశారు. వెంకట తేజ బాగున్నావా అంటూ నారా లోకేష్ ఆత్మీయంగా పలకరించినట్లు తెలియజేశారు. 2024 ఎన్నికల్లో ఎన్ఆర్ఐలు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలుపుతూ ఓట్లు వేయడంలో పెళ్లకూరు మండలానికి సంబంధించి వెంకటతేజ విశేషంగా కృషి చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ గెలుపులో తండ్రి మధునాయుడు ముఖ్య భూమిక పోషించడం పట్ల నారా లోకేష్ అభినందించారు.

## మోగా డీఎస్సీపై మొదటి సంతకం చేసిన చంద్రబాబుకి ధన్యవాదాలు

ఐటిడిపి అధ్యక్షులు బూతు ప్రసన్నకుమార్



బాలాయపల్లి, జూన్ 13, ప్రభాతవార్త

గత ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేసినా, కనీసం చలనం లేకపోవడంతో జగన్మోహన్ రెడ్డి ఒక్క డీఎస్సీ పోస్టును కూడా భర్తీ చేయలేదు. ఈ తరుణంలో అభ్యర్థులు అందరికీ అండగా ఉంటానని చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు మాట ఇచ్చారన్నారు. ఆ మాట నిలబెట్టుకుంటూ నేడు 16347 డీఎస్సీ పోస్టులు భర్తీకి మొదటి సంతకం చేయడం చాలా ఆనందకరన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్ల పెంపుపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, స్కిల్ సెన్సెస్ (గణన) పై ఐదో సంతకం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఐటిడిపి తరపున ధన్యవాదాలు తెలిపారు.

# చంద్రబాబు బాధ్యతల స్వీకరణతో నవశక పరిపాలనకు నాంది

**పుత్తూరురూరల్, జూన్ 13 ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి పదవి ప్రమాణం చేసిన సందర్భంగా అంబేద్కర్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలోరాష్ట్రం 20 సంవత్సరాలు వెనుకబడిపోయిందని, వైసీపీ ప్రభుత్వంలో ఏ సామాజిక వర్గం కూడా సంతృప్తిగా లేదని, ముఖ్యంగా ప్రతి పేదవాడు వైసీపీ ప్రభుత్వం పెంచిన పన్నులు కట్టలేని దీన స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో నేటితో ప్రజలు కష్టాలు తీరిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.



నగరిలో గాలి భానుప్రకాష్ ప్రజారంజక పరిపాలన అందిస్తారని, నగరిలో మరమగ్గ కార్మికులకు, రైతులకు, మామిడి రైతుల కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి పరిపాలన అందిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు గణేష్, పుత్తూరు పట్టణతెలుగు యూత్ అధ్యక్షులు బి.ఎస్.హరి, మున్సిపల్ కౌన్సిలర్ కేశవ ఆచారి, రాష్ట్ర మైనారిటీసెల్‌కార్యదర్శి మస్తాన్, నాయకులు మురళి, విక్కిరాయల్, కాజాఫీర్, చాను, లక్ష్మీపతి, పుత్తూరు పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు నవీన్, పుత్తూరు పట్టణ అధికార ప్రతినిధి బాబు, టీడీపీ రాష్ట్ర ఎన్నికల క్షత్రియ డైరెక్టర్ అయ్యప్ప, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుప్పయ్య, జిల్లా బీసీసెల్ మీడియా కో-ఆర్డినేటర్ మహేష్, విద్యాసాగర్, చిదంబరం, పుత్తూరు పట్టణ బీసీసెల్ కార్యదర్శి బాలాజీ, భరత్, బావాజీ, హేమంత్, చిరంజీవి, సంతోష్, మురగేష్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూలమాలల సంప్రదాయానికి స్వస్తి చెప్పండి: బొజ్జల సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త**



తనను కలవటానికివచ్చిన వారు సదాసీదాగా రావాలని బొజ్జల సుధీర్‌రెడ్డి పార్టీ కార్యాలయం నుంచి సమాచారం అందించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన జారి చేస్తూ తాను అందరిలో ఒక్కడినని అందరితో కలసిమెలసి ఉండాలని సూచించారు. తనను కలవటానికి వచ్చే అభిమానులు ప్రేమాభిమానాలతో రావాలని పూల మాలలు, బొకేలు, శాలువాలతో ఖర్చుపెట్టుకోకూడదని సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అభివృద్దిలో ప్రతి ఒక్కరు తనను తన తండ్రికి అందించిన సహకారాన్ని అందించాలన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుటకు అందరు సహకరించాలని పిలుపు నిచ్చారు. శుక్రవారం నుంచి అందుబాటులో ఉంటానని వివరించారు.

## నిత్యాన్న ప్రసాదానికి వైజాగ్ భక్తుల విరాళం

**శ్రీకాళహస్తి జూన్ 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ పథకానికి దేవస్థానం 80జి. ప్రకారం ఆదాయపు పన్ను మినహా యింపు వెసులు బాటు కల్పించారు. దాంతో విరాళాలు భారత దేశం నుంచే కాకుండా ప్రపంచ దేశాల నుంచి కూడా అందుతు న్నాయి. ఆలయంలో భక్తులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నది ఈ పథకం ఒక్కటే. గురువారం వైజాగ్‌కు చెందిన శ్రీవెంకటేశ్వరహోటల్స్ నిర్వాహకులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత ఆలయ ఎఇఒ సతీష్‌మాలిక్‌తో కలసి తాము నిత్యాన్న ప్రసాదంలో భోజనం చేసామని చాలా చక్కగా ఉందని కాబట్టి తాము విరాళం ఇవ్వాలనుకుంటున్నట్లు వివరించారు. బి.పోతరాజు కుటుంబసభ్యులతో రూ 1లక్ష 116లు విరాళంగా అందించారు. ప్రతి ఏడాది ఒక రోజు భక్తులకు తమ పేరు మీద భోజనాలు అందించాలని కోరారు. వారికి ఎఇఒ సతీష్‌మాలిక్ మరో సారి స్వామి అమ్మవార్ల అ ంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలతో పాటు తీర్ధ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లోపిఆర్‌ఒ నాగభూషణం నాయక్, రవి, ఏపిఆర్‌ఒ గోపాల్, శ్రీనాథ్, పార్థసారధి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్‌లు పాల్గొన్నారు.

## ఏపి హంస శ్రీకాళహస్తి తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

**.తొట్టంబేడు, జూన్ 13 ప్రభాతవార్త**




ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్(హంస)శ్రీకాళహస్తి తాలూకా యూనిట్‌ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజా ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్బంగా తొలుత జిల్లా అధ్యక్షులు రాజా మాట్లాడుతూ ఏపి హంస అసోసియేషన్ కార్యవర్గాల ఏర్పాటులో భాగంగా శ్రీకాళహస్తి ఎంతో ప్రాముఖ్యమైందని భావిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా అందరు ఏకమవ్వాలని హంస బలపరచిన ఉద్యోగులు బలోపేతమవ్వాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో వైద్య సిబ్బంది సమస్యలు ఎదురవుతున్న ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. వైద్య ఉద్యోగులకు అండగా ఏపి హంస రాష్ట్ర జిల్లా మరియు తాలూకా కార్యవర్గాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షుడుగా ఈ.నాగరాజు(చీఫ్ ఫార్మసి ఆఫీసర్, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి), ఉపాధ్యక్షులుగా పి.జయలక్ష్మి,( పిహెచ్‌సి, కెవిబిపురం,), బికె.విజయకుమార్(హెడ్‌నర్సు, ఏరియా ఆస్పత్రి) గంగమ్మ(ఎపిహెచ్‌ఎ(ఎఫ్)(ఏర్పేడు), జె.సుభాషిణి (ఎల్‌డి.కంప్యూటర్, ఎంపేడు), తాలూకా కార్యదర్శిగా పి.గౌరీ(పిహెచ్‌ఎస్, పిహెచ్‌సి, కాసరం), తాలూకా ట్రెజరర్‌గా ఎ.ముఖేష్‌నాథ్(సీనియర్ అసిస్టెంట్ పిహెచ్‌సి, కోవనూరు), ప్రచార కార్యదర్శిగా లీలా ప్రసాద్,(జూనియర్ అసిస్టెంట్, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి), మహిళా కార్యదర్శిగా డి.లత(ఎంపిహెచ్‌ఎ(ఎఫ్)(పిహెచ్‌సి, ఏర్పేడు), సంయుక్త కార్యదర్శులుగా కె.మధుమోహన్, (ఎంపిహెచ్‌ఎ, ఎంపేడు), వై.భాను ప్రకాష్, (ల్యాబ్‌టెక్నీషియన్, తొట్టంబేడు), ఏ.కామాక్షి, (ఎపిహెచ్‌ఏ, ఏర్పేడు), ఎస్.మణెమ్మ,(స్టాఫ్‌నర్స్, ఏరియా ఆస్పత్రి, శ్రీకాళహస్తి), సభ్యులుగా టి,అశోక్,(ఆఫీస్ సబార్టినేట్, కోవనూరు), ఎస్.జ్యోతి(ఎంపిహెచ్‌ఎ, ఎంపేడు), ఎం.రేవతి(సీనియర్ అసిస్టెంట్, ఏరియా ఆస్పత్రి, శ్రీకాళహస్తి), వి.భారతీ(ఎంపిహెచ్‌ఎ, కోవనూరు), కె.సంధ్య(సీనియర్ అసిస్టెంట్, శ్రీకాళహస్తి)లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్.ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఏపి హంస ఎన్నికల అధికారిగా మరియు ఎస్.గీతారాణి, ఉపాధ్యక్షులు ఏపి హంస చిత్తూరు జిల్లా సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సమావేశంలో శ్రీకాళహస్తి తాలూకా హంసకి ఎన్నిక కాబడిన కార్యవర్గం మరియు వైద్య ఆరోగ్యఉద్యోగులు జిల్లా అధ్యక్షుడు రాజా, కార్యదర్శి తాతాబాభాయ్‌గార్లనిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి డి.భాస్కర్, జిల్లా మహిళా కార్యదర్శి రోహిణి, కార్యనిర్వాహక కార్యదర్శి గిరిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకున్న అభిమాని

**శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్ర బాబునాయుడు అఖండ మెజారిటీతో గెలిచిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి ఎంఎల్ఏగా బొజ్జలవెం కటసుధీర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో ఎన్నికైన సందర్భంగా శ్రీకాళహస్తి కొండమిట్టకు చెందిన కిరణ్ తలనీలాలు సమరిపంచి మొక్కు తీర్చుకుని తిరుమల ఏడుకొండలస్వామివారిని దర్శించుకున్నారు. 58వ బూత్ నాయకులు పాల్గొన్నారు.

## సత్యకుమార్‌కు ఘనసత్కారం

**శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త**



భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి ఎంఎల్ఏ సత్యకుమార్‌ను బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించారు. ఈసందర్భంగా కేంద్రంలో నరేంద్రమోడీ మూడోసారి ప్రధానిగా ఎన్నికవ్వడం ఎంతో సంతోషమని దేశంలోని ప్రజలందరు సంతోషంగా ఉండాలంటే నరేంద్రమోడీ పాలన కావాలని కోరారు.

## దేవూరు భారతికి విద్యాదాత సిహెచ్ సాంబయ్య స్మారక అవార్డు

**తిరుపతి విద్య, జూన్ 12, ప్రభాతవార్త**



గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సాంబయ్య స్మారక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సాంబయ్య 30వ వర్ధంతి, 15వ వార్షికోత్సవ సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ల ప్రొఫెసర్ డి. భారతికి విద్యాదాత సిహెచ్ సాంబయ్య స్మారక అవార్డు అందజేసి సత్కరించటం జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్ భాస్కర రావు సభకు అధ్యక్షత వహించారు. వైస్ ఛాన్సలర్ భారతి విద్యా రంగంలో చేసినటువంటి కృషికి, పరిశోధనలు బోధనలు, ఆమె అందుకున్న అవార్డులు, వైస్ చాన్సలర్‌గా చేసినటువంటి అభివృద్ధి పనులకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పయ్యావుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## మాకు గౌరవ వేతనం చెల్లించండి

**నగరి, జూన్ 13 ప్రభాతవార్త:**



ఎన్నికల విధుల్లో పాల్గొన్న తమకు రావలసిన గౌరవ వేతనం చెల్లించాలని నియోజకవర్గ సెక్టార్లు, రూట్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్‌టీ టీమ్ మెంబర్లు ఎన్నికల అధికారి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంకు చేరుకున్న వారు తమకు ప్రభుత్వ నిబంధనల మేరకు రావలసిన వేతనం, టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ జిల్లా అధికారులతో చర్చించి రూ.10 వేలు చెల్లిస్తామని తెలిపారు. దీనిపై ఎన్నికలకు పని చేసిన సిబ్బంది మాట్లాడుతూ తమకు త్వరగా డబ్బులు చెల్లించి న్యాయం చేయాలన్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారం పురస్కరించుకుని అన్నదానం

**విజయపురం, జూన్ 13 ప్రభాతవార్త:**



మండలంలో టీడీపీ నేతలు సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పన్నూరు సబ్‌స్టేషన్, పన్నూరు ఆది ఆంధ్రవాడ, ఇల్లత్తూరు, చెంగమనాయుడు కండ్రిగ, మాధవరం గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణంలో పాలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు రవిచంద్రరెడ్డి, బెంజిమన్, చంద్రయ్య, మునిభాస్కర్‌రాజు, సెల్వం, ఉదయరెడ్డి, పెరుమాళ్, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడు ఎమ్మెల్యేని సన్మానించిన టీడీపీ నాయకులు

**కేవీబీ పురం, జూన్ 13 ప్రభాతవార్త:**

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంనితిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

**కేవీబీ పురం, జూన్ 13 ప్రభాతవార్త:**



కేవీబీ పురం మండలం తిమ్మసముద్రం గిరిజన కాలనీలో ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జా తీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రగతి ట్రస్టు కో-ఆర్డి నేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బడిఈడు పిల్లలు ప్రతి ఒక్కరు పాఠశాలకు రావాలని విద్య నేర్చుకోవాలని ఏ ఒక్కరు బడిమానకుండా విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రభుత్వం అందిస్తున్న పాఠశాలల్లో సౌకర్యాలను ఉపయోగించుకుని చదువుకోవాలని కోరారు. బాల కార్మికులు కాకుండా తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు పాఠశాలకు పిల్లలను పంపించాలని తెలిపారు. ప్రజాప్రగతి ట్రస్టు కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలోని గిరిజన కాలనీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఒక్కరు పాఠశాలకు వచ్చేందుకు తల్లిదండ్రులకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ట్రస్టు సిబ్బంది గంగయ్య, ఈశ్వరయ్య, తిమ్మసముద్రం సచివాలయం కార్యదర్శి ఇంటింటా ప్రదర్శన నిర్వహించి ర్యాలీ నిర్వహించారు.

## అధ్వాన్నంగా రోడ్లు: ఆర్అండ్‌బి శాఖ పట్టించుకోదు

**శ్రీకాళహస్తి రూరల్, జూన్ 13 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండలంలోని రెండు ప్రధాన రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి ఇందులో శ్రీకాళహస్తి-ముచ్చివోలు-పల్లం, శ్రీకాళహస్తి-రామాపురం-పాపానాయుడుపేట రోడ్లు ప్రధానమైనవి. ఈ రెండు రోడ్లును బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆర్అండ్‌బి మంత్రిగా ఉన్నపుడు పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఉన్న రోడ్లను ఆర్అండ్‌బి శాఖలో కలిపారు. తరువాత వాటికి మహర్థశ కలించారు. శ్రీకాళహస్తి-రామాపురం రోడ్డు అయితే కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు సాధించారు. వేస్ట్ లాండ్ డెవలప్‌మెంట్ పథకంలో నిధులు సాధించి రోడ్డుపక్కన చక్కగా చెట్లను పెంచారు. నేడు మార్గాన్ని పరిశీలిస్తేమండుటెండలోనూ, వేసవిలోనూ చల్లగా ఉంటుంది. పక్కన స్వర్ణముఖి నది ప్రవహిస్తుండటంతో చల్లని వాతావరణం చోటు చేసుకుంది. అయితే ఈ మార్గంలోని తారు రోడ్డు ధ్వంసం అయ్యింది. దానిని గురించి పట్టించుకునే నాథుడు లేదు. ఐదేళ్ళ పాటు పాలకులు అభివృద్ధిపై దృష్టి సారించలేదు. దాంతో శ్రీకాళహస్తి - రామాపురం మధ్య రోడ్డు గతుకుల మయంగా మారింది. ఇక శ్రీకాళహస్తి పల్లం రోడ్డును డబలింగ్ కార్యక్రమాలను చేపట్టారు. కానీ పనుల అస్తవ్యస్తంగా నాసిరకంగా ఉన్నాయి. రోడ్డు వెడల్పుకు వాడుతున్న మెటల్, సిమెంట్ మిక్సింగ్‌పై పలు విమర్శలు చోటు చేసుకున్నాయి. ఈ రోడ్డును వెడల్పు చేయటం అభినందనీయమే కానీ రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోవటం గమనించదగ్గ విషయం. మండలంలోని రోడ్ల పరిస్తితి అధ్వాన్నంగా మారింది. ఈ రెండు మార్గాల్లో నిత్యం గ్రామాల్లోంచి ప్రతి రోజూ ఉదయం పట్టణానికి తమ వాహనాలపై చేరుకుంటున్నారు. కానీ ఈ రోడ్ల మీద ప్రయాణం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అర్అండ్‌బి అధికారుల మొద్దు నిద్రనుమాని మేల్కొని కనీసం తాత్కాలిక మరమ్మత్తులు అయినా చేపట్టాలని కోరుతున్నారు.



# తిరుపతి డివిజన్

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

**నారాయణవనం, జూన్ 13 ప్రభాతవార్త :**



పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండల పరిధి స్థానిక ఇద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలకు సమీపం వాటర్ సర్వీస్ సెంటర్ వద్ద బుధవారం రాత్రి 11.3గంటల ప్రాంతంలో నారాయణవనం నుంచి పుతూ ్రు కాలినడక నడిచి వెలుతున్న యువకున్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్టు ఎస్ఐ డి లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి. మండల పరిధిలోని కీళగరం పంచాయతీ దాసరివీధికి చెందిన విఘ్నేష్(26) బుధవారం రాత్రి పుత్తూరుకి నడిచి వెళుతున్నాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని వాహనం అతని ఢీకొనడంతో తీవ్రగాయాలు ఏర్పడినది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ, డ్రైవర్ రాజేష్‌లు 108 అంబులెన్స్‌లో పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విఘ్నేష్ మృతి చెందాడు. గురువారం వారి బందువుల సమక్షంలో శవ పంచనామా చేసి మృతదేహాన్ని అప్పగించారు. విఘ్నేష్‌కి వివాహం కాలేదు. ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో అన్నదానం

**నారాయణవనం, జూన్ 13 ప్రభాతవార్త :**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయడంతో పాలమంగళంఉత్తరపుకండ్రిగకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండాను ఎగురవేసినత తర్వాత కేక్‌కట్ చేశారు. అనంతరం సుమారు 200మందికి అన్నదానం చేశారు. బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ వైస్ ఎంపిపి టి సుబ్రమణ్యం, నాయకులు కోదండపాణి, పట్టాబిరెడ్డి, మునిబాబు, తిరుమలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయి సుధా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**తిరుపతి హెల్త్, జూన్ 13, ప్రభాతవార్త**



తిరుపతిలోని తిలక్ రోడ్ లోని శ్రీ సాయిసుధా కంటి ఆసుపత్రిలో గురువారం ఉచిత రెటీనా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందని వివరించారు. అలాగే వ్యాధి గురించి వారికి అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరిగిందన్నారు. మధుమేహం ఉన్న వారిలో డయాబెటిక్ రెటినోపతి అనే కంటి వ్యాధి వస్తుంది ఇలాంటప్పుడు రక్తంలో చెక్కర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతిస్తాయని తెలిపారు. రెటీనా అనేది కంటి లోపల భాగంలో కాంతి సెన్సిటివ్ భాగం, డయాబెటిక్ రెటీనోపతి యొక్క ప్రారంభ దశలో దృష్టి సారించగలిగితే నివారించగలుగుతామన్నారు. ఈ వ్యాధి రెటినోపతి అభివృద్ధి చెందుతున్నప్పుడు దృష్టి ప్రభావితం కావచ్చు పరిస్థితిని చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డయాబెటిస్ ఉన్నవారు ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లయితే మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకున్నట్లయితే డయాబెటిక్, రెటీనోపతి బారిన పడకుండా, కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని డాక్టర్ సుధారాణి తెలియజేశారు. ఈ వైద్య శిభిరంలో హాస్పటల్ సిబ్బంది చిట్టెమ్మ, హిమబిందు, మహేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి..!

**ఎంఈఓ శ్రీవరం లలితకుమారి**

**చంద్రగిరి, జూన్ 13 ప్రభాతవార్త:**



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. స్థానిక రాములవారిగుడి వీధిలోని ఎంపిపిఎస్ స్కూల్ ఆవరణలో గురువారం పర్యా వరణ దినోత్సవం సందర్భంగా ఆమె విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోవడంపై పిల్లలకు అవగాహన కల్పించారు. పెరుగుతున్న కాలుష్యం నుండి మనతో పాటు భావితరాలను రక్షించుకునేందుకు చెట్లు దోహదపడగలవన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలోఎంఈఓ-2 కె.భాస్కర్‌బాబు, హెచ్ఎం శారద, టీచర్ చెంచులక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు హాట్ బాక్సులు వితరణ

**రేణిగుంట, జూన్ 13 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ వేమాపురం, సంజీవరెడ్డి కాలనీల్లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలకు గురువారం సర్పంచ్ వి.లక్ష్మిపతిరెడ్డి మధ్యాహ్నం భోజనం ఉంచడం కోసం రెండు హాట్ బాక్సులను వితరణ చేశారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు వేడి తగ్గకుండా ఉండడం కోసం పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హాట్ బాక్సులను ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. పాఠశాలలో ఇంటర్‌నెట్, వైఫైలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ఇప్పటికే స్మార్ట్ టీవీలు పని చేయడానికి ఇన్వర్టర్‌ను సమకూర్చినట్టు తెలిపారు.

## సి.మల్లవరంలో టిడిపి విజయోత్సవ ర్యాలీ

**-గ్రామ పంచాయతి కార్యాలయంలో స్వీట్స్ పంచిన మనోహర్ చౌదరి**

**తిరుపతిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో సుదీర్ఘ విరామం తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన శుభ సందర్భంగా తిరుపతి రూరల్ సి.మల్లవరం గ్రామ పంచా యతి టిడిపి ఇన్‌చార్జి మనోహర్ చౌదరి ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత నడివీధి గంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పంచాయతి కార్యాలయానికి ర్యాలీగా వెళ్ళి ముఖ్యమంత్రి చిత్ర పటంతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఫోటోను ప్రదర్శించారు. అనంతరం మనోహర్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం శుభ పరిణామం అని, టిడిపి పాలనలో అధికారులకు ఎలాంటి వేధింపులు ఉండవని, అధికారులు నిష్పక్షపాతంగా అవినీతికి చోటు లేకుండా అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## తుమ్మలగుంట మఠం ఇండ్లదారులకు నో-అబ్జెక్సన్ సర్టిఫికేట్ జారీ

**తిరుపతిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ తుమ్మలగుంటలో ఉన్న హథీరాంజీ మఠం భూము లలో ఇళ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు మంచి రోజులు వచ్చాయి. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు తుమ్మలగుంట టిడిపి అధ్యక్షుడు బిరుదాల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మఠం ఇండ్ల లబ్దిదారులకు నో-అబ్జెక్సన్ సర్టిఫికేట్స్ అందజేసినట్లు తెలిపారు. గురువారం మఠం ఇండ్ల నిర్మాణదారులు 45 మందికి నో-అబ్జెక్సన్ సర్టిఫికేట్స్ అందజేసినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. పేదలు నిర్మించుకున్న ఇండ్లకు కరెంట్ మీటరుతో పాటు ఇంటి పన్నులు కూడా వేయించి, హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిరుదాల కృష్ణారెడ్డి, పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సిఎం చంద్రబాబును కలసిన

## ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, జూన్ 13 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును గురువారం ఎమ్మెల్సీ,కుప్పం తెదేపాసమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సిఎం చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మెగా డిఎస్సీ పై సిఎం చంద్రబాబు తొలిసంతకం చేయడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబునాయుడు సిఎంగా తన తొలి సంతకాన్ని మెగా డిఎస్సీ నిర్వహణ ఫైల్‌పై చేయడం ఆనందంగా ఉందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో రానున్న ఐదేళ్లలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చె ందడం ఖాయమని దేశంలోనే ఉత్తమ రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వేపాడ చిరంజీవి రావు పాల్గొన్నారు.

## స్థానికులకు అండగా ఉంటా..

### జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి కార్పొరేషన్, జూన్ 13, ప్రభాతవార్త

స్థానికులకు అండగా ఉంటానని జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటి వద్ద సందడి నెలకొంది. రాయలసీమలో అత్యధిక మెజారిటీతో గెలిచిన ఆరణి శ్రీనివాసులను అభినందించేందుకు అన్ని వర్గాల ప్రజలు వస్తుండటంతో ఆయన నివాసం గురువారం సాయంత్రం కోలాహలంగా మారింది. మున్సిపల్ అధికారులు, డాక్టర్ శివశంకర్‌తో స్విమ్స్ డాక్టర్లు, ఎంఆర్ పల్లి మాజీ సర్పంచ్ మమత, తిరుమల టిడిపి అధ్యక్షులు రాజు యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వైసిపి నేతలు తతిరఉమలలో తొలగించిన సంఘమిత్రలను తిరిగి కొనసాగించాలని రాజు యాదవ్ కోరారు. అలాగే అనధికారికంగా పెట్టిన తట్టలు, అనుమతిలేని హాకర్ లైసెన్స్‌లు రద్దు చేసి తిరుమల వాసులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. తిరుమలలో వైసిపి నేతలు చేసిన అన్ని అక్రమాలు వెలికి తీసి తిరుమల వాసులకి అండగా నిలబడతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట ఇచ్చారు.

## తిరుపతిలో బాగా పనిచేశారు

### మీ సేవలు గుర్తుంచుకుంటా -కంకణాలతో సిఎం చంద్రబాబు



తిరుమల, జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి: ఎన్నికల సమయంలో పార్టీ ఆదేశాలను తూచ తప్ప కుండా తిరుపతిలో నేతలు,కార్యకర్తలు కష్టపడి పనిచే శారని, కూటమి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివా సులును గెలిపించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతిలో తెలు గు దేశంపార్టీ నాయ కులు సమిష్టిగా పనిచేశారని, మీ సేవలు గుర్తుంచుకుంటానని అన్నారు. నాల్గవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి గురువారం ఉదయం ఇష్టదైవాన్ని దర్శించుకున్న అనంతరం గాయత్రి నిలయం అతిధిగృ హంలో అధినేత,సిఎం చంద్రబాబునాయుడును తెలుగుయువత రాష్ట్రఅధికార ప్రతినిధి కంకణాల రజినీకాంత్‌నాయుడు కలిశారు. బుద్ధుని విగ్రహం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యువత పార్టీకి ప్రధానమని, అందరూ ఇదే స్ఫూర్తితో అభివృద్ధికి పనిచేయాలని బాబు కంకణాలకు సూచించారు. చంద్రబాబును కలసి రజినీకాంత్‌నాయుడు, గాలిపవన్, జయచంద్రనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి దుశ్శాలువతో సన్మానించి మొమెంటోను బహుకరించారు.

## యాక్సిడెంట్ కేసులో నూతన తీర్పు

నగరి, జూన్ 13 ప్రభాతవార్త:

యాక్సిడెంట్ కేసులో నేరం నిరూపణ కావడంతో ముద్దాయికి జడ్జి విష్ణువర్మ నూతన తీర్పును ఇచ్చారు. వివరాలు ఇలా... 2022 సంవత్సరంలో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన సంఘటనలో వెంకటరమణ అనే వ్యక్తిపై నగరి పోలీస్‌స్టేషన్‌లో యాక్సిడెంట్ కేసు నమోదైంది. ఈ కేసు విచారణ నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం ముగింపుకు వచ్చింది. నేరం నిరూపణ కావడంతో ముద్దాయికి శిక్షపడింది. మృతుని కుటుంబానికి రూ.10 వేలు నష్ట పరిహారం చెల్లించడంతో పాటు ఆరు నెలల పాటు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కమ్యూనిటీసర్వీస్ చేయాలని జడ్జి విష్ణువర్మ శిక్ష విధించారు. కాగా ఇలాంటి తీర్పు వెలువరించడం ఇదే మొదటి సారి అని కోర్టు సిబ్బంది తెలిపారు. కేసు వాదనలో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎం.రామశాంతి, సీఐ సురేష్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ తెలిపారు.



పోలీసులతో జడ్జి

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు



రేణిగుంట విమానాశ్రయంలో సిఎం చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎస్‌సివి నాయుడు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం







గాజులమండ్యం సర్కిల్ వద్ద టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

రేణిగుంట, జూన్ 13 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఘనంగా వీడ్కోలు లభించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారు, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనాలు ముగించుకుని తిరుగు ప్రయాణంలోరేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంబయట ఆయన కోసం నిరీక్షిస్తున్న ప్రతి ఒక్కరికి అభివాదం చేశారు. అనంతరం అనంతపురం రేంజి డీఐజీ షిమోషి, తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.వి.నాయుడు, సుగుణమ్మ, వరప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, తదితరులు మంత్రికి సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నేతల కోసం నారా చంద్రబాబునాయుడు తన కాన్వాయ్‌ని ఆపారు. నారా చంద్రబాబునాయుడుతో పాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఉన్నారు. రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, తిరుపతిజిల్లా టీడీపీ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట పట్టణ తెలుగు యువత నాయకులు ఎంజీ రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, మునీర్ జీకే, నెల్లూరు సుబ్రహ్మణ్యం, ఈ సర్పంచ్ జ్యోతినారాయణ, చంద్రబాబుకు అభివాదం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబు అందరిని ఆప్యాయంగా పలకరించారు.

## ఎస్వీయూలో మెగా డీఎస్సీపై

## టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సంబరాలు



మెగా డీఎస్సీ పై టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంబరాలు

తిరుపతి విద్య, జూన్ 13, ప్రభాతవార్త

నవ్యాంధ్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొటి సంతకం నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తు కోసం 16347 వేల పోస్టులతో మెగా డిఎస్సి పై తన తొలి సంతకాన్ని, అన్నార్తుల ఆకలి తీర్చడానికి అన్నా క్యాంటీన్, రైతుల పాలిట శాపంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అవ్వతాతలకు అండగా పెద్ద కొడుకు స్థానంలో పింఛన్లను 4 వేలకు పెంపు వంటి వాటిపై సంతకాలను లిఖించారు. మరోసారి నవ్యాంధ్ర సృష్టికర్తగా నిలిచారు. రాష్ట్రంలో ప్రజలు ఎంతోమంది విద్యార్థులకు అండగా ఉంటు తమ కలలు కన్నా భవిష్యత్తును అందించడానికి ముందడుగు వేశారని దీనికి స్వాగతిస్తూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిరుద్యోగ యువత కృతజ్ఞతా భావంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్కె నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డా. పాకనాటి హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆంధ్రదేశానికి ఆరాధ్య దైవం, అకుంఠిత దీక్షాపరుడు, నిరుద్యోగులకు అపర భగీరథుడు, పేద ప్రజల పక్షపాతి, ఆంధ్రదేశానికి ఆపద్బాంధవుడుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి నిలిచారని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిశోధకులు డా. రమేష్, డా. చిట్టిబాబు వెంకటేశ్వర్లు నాయుడు, విద్యార్థులు భీష్మ, శ్రీరామ్, సోమేశ్, బషీర్, రామంజి, రమేష్, రఘు, పెద్దయ్య, లక్ష్మన్న, రంగన్న, సురేష్, మల్లయ్య, అంజేనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బండవేషంతో మిట్టగంగమ్మకు మొక్కులు

### ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి



చంద్రగిరి, జూన్ 13 ప్రభాతవార్త: బండ వేషధారణలతో భక్తులు శ్రీ మిట్టగంగమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరిలోని శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవ రోజు గురువారం ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బు స్వామి, అలంకరణ నిర్వహకులు ఉగ్రాణం సుబ్రమణ్యం రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని విశేష అలంకరణ గావించారు. ఈనాటి కార్యక్ర మాలకు నరశింగాపురం ఎంపిటిసి మించల ప్రవీణ్‌కుమార్, రెడ్డివీధి నారంగారి సుబ్రమణ్యం, సుగుణ, పాదిరి పుష్ప జ్ఞాపకార్థం భర్త పాదిరి చంద్రశేఖర్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులకు ఆలయ చైర్మన్ అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## సత్యకుమార్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త

భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి ధర్మవరం ఎంఎల్ఏ రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్‌ను రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఘనంగా శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రయమంలో, జిల్లా కార్యదర్శి అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా సభ్యులు ఎస్వీరమణ జిలనఆల యువ మోర్చా ఉపాధ్యక్షుడు హరీష్, యువమోర్చా అధ్యక్షుడు భరత్‌కుమార్‌నాయుడు, నాని తదితరులు పాల్గొన్నారు

### చంద్రబాబుకు స్వాగతం పలికిన



### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 13, ప్రభాతవార్త

తిరుమలకు శ్రీ వారి దర్శనానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రేణిగుంట విమానాశ్రయంలో తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సాదర స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో పాటు ఆరణి తిరుమలకు వెళ్లారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఆరణి శ్రీనివాసులు శ్రీవారిని దర్శించుకున్నారు.

## కనువిందు చేస్తున్న దేవతాపుష్పాలు

చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త



దేవతాపుష్పాలుగా పిలువబడే బ్రహ్మకమలాలు విరబూసి కనువిందు చేస్తున్నాయి. పట్టణంలోని కుంచి రాజు ఇంట బ్రహ్మ కమలాల చెట్టు వుంది. ఆచెట్టు నిండా పుష్పాలు పూశాయి. ఆకు నుంచి మాత్రమే పూసే ఈ పుష్పాలు హిమాలయాల్లో పూస్తాయనీ, బ్రహ్మదేవుడు వీటిని ఆసనంగా కల్గివుండటం వల్ల బ్రమ్మకమలాలంటారని పండితులు అంటున్నారు. పరమశివుడికి ప్రీతిపాత్రమైన ఈ పుష్పాన్ని ఉత్తరాఖండ్ రాష్ట్రం జాతీయపుష్పంగా ప్రకటించింది. అంతేకాకుండా తపాలాశాఖ పుష్పం ఆకారాన్ని ముద్రించి అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. రాత్రిళ్ళు మాత్రమే వికసించే బ్రహ్మకమలాలు సుగంధ వాసన వెదజల్లుతూ అందరినీ ఆకర్షిస్తున్నాయి.

## ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

### సుమారు రూ. 7500 విలువ గల ఒకటిన్నర కేజీల గంజాయి

### రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం

తిరుపతి క్రైం, జూన్ 13, ప్రభాతవార్త

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు చేసి ఒక చట్టంతో సంఘర్షణ బాలుడు నిర్బంధం, సుమారు రూ. 7500 విలువ గల ఒకటిన్నర కేజీల గంజాయి, దొంగలించిన రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి క్రైం పోలీసులు తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, రామాంజుపల్లి సర్కిల్, నందిని రెస్టారెంట్ (డిల్లీస్ హోటల్) సమీపంలో నాయుడు పేట - పూతలపట్టు బైపాస్ రోడ్డు పై అరెస్టు చేసి వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా.. కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ జిల్లా మైసూర్ టౌన్ లలిత మహల్ వెనుక వైపు గిరిధర్శిని లేఔట్‌లోని డోర్ నెంబర్ 434కు చెందిన లేట్ జయరామ్ కుమారుడు జె.హెచ్.భరత్ (22), కర్నాటక రాష్ట్రంలోని బెంగలూరు సిటీలో ఉన్న దొడ్ల బొమ్మసంద్ర, విద్యారణ్యపురం, యెలహంక, డోర్ నెంబర్ 42లో నివాసం ఉన్న లేట్ మస్తానప్ప తమ్మయ్య కుమారుడు కార్తీక్ అంజన్ కుమార్ (23)లు గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారని జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ఎస్ఐ ఎస్. షేక్షవలి తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్షవలి కేసు వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లాలో గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు ఇదివరకే జిల్లా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్. వినోద్ కుమార్ పర్యవేక్షణలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేసుకున్న ఇన్ఫార్మర్స్ ద్వారా గంజాయి అక్రమ రవాణా గురించి సమాచారం తెలుసుకుని గురువారం ఉదయం 9 గంటల సమయంలో తిరుపతి రూరల్ మండలం, రామాంజుపల్లి సర్కిల్, నందిని రెస్టారెంట్ (డిల్లీస్ హోటల్) సమీపంలో నాయుడు పేట - పూతలపట్టు బైపాస్ రోడ్డు పై అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేయగా, వారి వద్ద సుమారు 7.500 రూపాయిలు విలువ గల ఒకటిన్నర కేజీల గంజాయిని, వారు కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా, బంగారుపేట వద్ద దొంగలించిన రెండు మోటార్ సైకిళ్ళను గుర్తించి, సీజ్ చేయడం జరిగిందన్నారు. అరెస్టు చేసిన ఇద్దరు ముద్దాయిలను తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ద ప్రవేశ పెట్టగా వారికి జ్యూడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, చట్టంతో సంఘర్షణ బాలుడును జువెనెల్ జస్టిస్ బోర్డు, తిరుపతి వారి వద్ద హాజరు పరచగా అతడిని జువెనెల్ హోమ్‌కి పంపుతూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ ఇద్దరు ముద్దాయిల్లో ఒకరు జువెనెల్‌గా ఉండి కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే వారు ముగ్గురు కలిసి మంచి స్నేహితులుగా ఉంటూ మద్యం, గంజాయి త్రాగుతూ, కొంత గంజాయిని ఎక్కువ రేటుకు అమ్ముతూ వుండేవారని తమ విచారణలో తెలిసిందన్నారు. బస్టాండ్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుండి కొనుగోలు చేస చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసుకుని ఎక్కువ డబ్బులకు వినియోగదారులకు అమ్మి అదనంగా డబ్బులు సంపాదించే వారని తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. షేక్షవలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రగిరి-శ్రీనివాస మంగాపురం రోడ్డు బాగు చేయండి..!

### అవినీతి రహితంగా ప్రజలకు మెరుగైన సేవలందించండి..! ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులకు దిశానిర్దేశం



చంద్రగిరి, జూన్ 13 ప్రభాతవార్త:

చంద్రగిరి-శ్రీనివాస మంగాపురం రహదారి అధ్వాన్నంగా తయారైయ్యిందనీ వెంటనే బాగు చేయాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిధి గృహంలో గురువారం ఆయన మొదటిసారి అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో గతుకుల మయమైన రోడ్లు, పాడైన కల్వర్టులు, బ్రిడ్జీలు, పూడుకు పోయిన కాలువల పునరుద్ధరణకు అంచనాలతో పూర్తి స్థాయి నివేధికను రూపొందించాలని ఆదేశించారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు, రైతులకు పట్టాదారు పాస్ బుక్‌లు మంజూరు చేయడంలో అవినీతి రహితంగా మెరుగైన సేవలందించాలని ఆదేశారు. తాను అవినీతికి పాల్పడబోననీ, ఎవరైనా అవినీతికి పాల్పడితే క్షమించేదిలేదని తేలి చ్చెప్పారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎటువంటి వత్తిళ్ళకు గురికావద్దనీ, నిష్పక్షపాతంగా మీ విధులను నిర్వహించవచ్చని అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైనందున విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తన పేరు చెప్పి ఎవరైనా మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేసినా, వత్తిడి చేసినా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అధికారుల పనితీరుపైనే అభివృద్ధి ఆధారపడివుంటుందని అన్నారు. తనతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు అందరూ సమన్వయంతో కలసి నడిస్తే అభివృద్ధి సాకారం కాగలదన్నారు. అనంతరం అధికారులు ఎంఎల్ఏచే కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి ఈఈ మధుసూదన్‌రావు, డిఈ సూర్యనారాయణ రెడ్డి, ఏఈ మాదవన్, ఎంపిడిఓ డాక్టర్ వి.వి.సూర్యసాయి, ఎంపిడిఓ ఏఓ రవిచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ అమృత, ఏపిఎం సరిత, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కొండూరు ప్రవీణ్ రాయల్, సక్కుర్ ధనంజయ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, శానంబట్ల తులసి రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, శ్రీదర్ నాయుడు, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ముదిపల్లి సురేష్ రెడ్డి, గౌస్‌భాషా, చెరుకూరి శేఖర్, దుబాసి రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.